# దాహం



మా ఊరు మహాపట్టణం. కొన్ని లక్షల జనం ఉన్నారు. రోడ్లు, కార్లు, బస్సులు, రైళ్లు అన్నీ ఉన్నాయి. ఎత్తైనమేడలున్నాయి.

మేడల నీడల్లో వేల కొద్దీ గుడిసెలున్నాయి. సినిమాలు, టీ.వీలు, నైట్‌క్లబ్బులు, అయిదు నక్షత్రాల హోటళ్ళు ఉన్నాయి. అన్నీ ఉన్నాయి కాని వేసవిలో తాగడానికి నీళ్లు లేవు. అదీ ఈ పట్టణం ప్రత్యేకత.

మండు వేసవిలో నగరం బొగ్గుల కుంపటిలా ఉంటుంది. ఆవులించిన పులి నోరులా, ఎర్రటి మంటలా భయంకరంగా ఉంటుంది. ధనికులకీ దరిద్రులకీ అందరికీ దాహం వేస్తుంది. కాని తాగడానికి నీళ్లుండవు. కొళాయిల్లో నీళ్లు రావు. నూతులు ఎండిపోతాయి. పురపాలక అధికారులు లారీలతో వీధివీధికి ఇంటికో రెండు బకెట్ల నీళ్లిస్తారు. లారీల చుట్టూ జనం ఈగల్లా ముసురుతారు. ఎక్కడ నీళ్లుంటే అక్కడికి బిందెలు పట్టుకు పరుగెడతారు. వేసవిలో నీళ్లు సంపాదించడం ఒక పెద్ద ఉద్యమంలా సాగుతుంది.

నగరానికి నీళ్లు సప్లయి చేసే ఆఫీసులో జూనియర్ ఇంజనీరుగారు పైన ఫంకా తిరుగుతున్నా చెమటలు కారుస్తున్నారు. మాటిమాటికి కిటికీలోంచి చూస్తున్నారు ఎండ ఎలా ఉందా అని. ఎండకేం మహారాజులా ఉంది. ఏభై ఏళ్ల వయసులో తన భారీ శరీరాన్ని ఈ ఎండలో భరించడం కష్టంగానే ఉంది. పక్కనున్న ఫైలు తీసి నెమ్మదిగా విసురుకుంటూ ఆలోచిస్తున్న సమయంలో "నమస్కారం సార్" అంటూ భాస్కర్ లోపలికొచ్చాడు.

"ఓ, నువ్వా భాస్కర్, ఎప్పుడొచ్చావు?" జూనియర్ ఇంజనీరుగారికి భాస్కర్ చిన్ననాటి మిత్రుడు. కాలేజీలో తనకి జూనియర్. తనకంటే వయసులో బాగా చిన్నవాడు. ఏదో కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అసలిప్పుడు ఎందుకొచ్చాడో, ఏదైనా పని మీద వస్తే వీడిని డబ్బులు అడగడమెలాగ? నెమ్మదిగా గుమాస్తాచేత అడిగించవచ్చునులే అనుకున్నారు జూ. ఇంజనీరుగారు.

"వచ్చి ఆరు నెలలైంది. ఈ ఊరు బదిలీ అయింది. మా ఫాదరూ వాళ్ళూ ఇక్కడే ఉన్నారుగా"

"అలాగా?"

"ఎలా ఉంది మీ ఉద్యోగం?" అని చిరునవ్వుతో అడిగాడు భాస్కర్. జూ.ఇంజనీరు గారికి ఉద్యోగం చాలా బాగుంది. చాలా తృప్తిగా ఉంది. మంచి ఇల్లు కట్టేరు. ఇద్దరు కూతుళ్ళకి మంచి కట్నాలిచ్చి పెళ్ళిళ్లు చేశారు. ఒక కొడుకు ఇంజనీరింగు చదువుతున్నాడు. మరి ఉద్యోగం బాగున్నట్టే కదా. కాని ఆయన అలా చెప్పరు.

"ఏం ఉద్యోగంలే. ఏదో ఈడ్చుకొస్తున్నాం. ఇంకో ఎనిమిదేళ్లలో రిటైరైపోతాను. ఆ తరువాత ఏం చెయ్యాలో తెలీదు. మీ కంపెనీలో ఉద్యోగం ఇప్పించు" అన్నారు జూ.ఇంజనీరుగారు నవ్వుతూ.

"ఎనిమిదేళ్ల తరువాత ఏం చెయ్యాలా అని మీరు ఆలోచిస్తున్నారు. మా కంపెనీ సిక్ అయిపోయింది. ఆర్నెల్లలో మూసేస్తారు. ఆర్నెల్ల తరువాత ఏం చెయ్యాలా అని నేను ఆలోచిస్తున్నాను. అది సరేగాని, నేనిప్పుడు వచ్చిన పనేమిటంటే — ఈ ఊళ్లో మా ఫాదరు ఒక చిన్న ఇల్లు కట్టేరు. దానికి మీ ఆఫీసు వాళ్లు వాటరు కనెక్షన్ ఇవ్వాలి. ఇదిగో అప్లికేషను"


"కనెక్షన్ ఉన్న వాళ్ళకే నీళ్ల సప్లయి లేదు బాబూ. నీకు కొత్త కనెక్షన్ కావాలా?"

"నుయ్యి తవ్వించాం. కాని నూతిలో నీళ్లు లేవు.

"ఇప్పుడు నీళ్లున్నది ఒక్క సముద్రంలోనే. ఇంకెక్కడా లేవు" అంటూ జూ.ఇంజనీరుగారు తన జోక్‌కి తనే నవ్వుకున్నారు.

"మరేం చెయ్యమంటారు?"

"చెయ్యడానికేం లేదు. నీటి సప్లయి పొజిషన్ బాగయ్యేదాకా కొత్త కనెక్షన్‌లు ఇవ్వద్దని ఆర్డరు వేశారు. అర్థంలేని ఆర్డరు. నీళ్లు లేకపోతే కనెక్షన్ ఇవ్వడానికభ్యంతరం మెందుకో నాకర్థం కాదు. నీళ్లు వస్తే వస్తాయి లేకపోతే లేదు. రోజుకొకటో రెండో కనెక్షన్స్ ఇచ్చేవాళ్లం. ప్రతి కనెక్షన్‌కి మాకు ఎంతో కొంత ముట్టేది. ఈ ఆరరుతో మా కడుపులుకొట్టేరు. ఆదాయం పడిపో





యింది. అదీ మా ఏడుపు.

"పై రాబడన్నమాట"

"లేకపోతే గంపెడు సంసారం ఈ జీతం రాళ్లతో గడుస్తుందా నాయనా"

"మరిప్పుడెలా గడుస్తొందట"

"భగవంతుడేదో దారి చూపించకుండా ఉంటాడా బాబూ. వీధి వీధికీ నీళ్ల లారీల్లో పంపుతున్నాం కదా. బకెట్‌కి ఇంతా అని పుచ్చుకుంటాం. నిజానికి ఎండల్లో రాబడి బాగుంటుంది. భగవంతుడి దయవల్ల ఈ ఎండ ఇలా మరో నాలుగు నెలలుంటే బాగుంటుంది" అంటూ ఎదురుగా ఉన్న దేవుడి పటానికి దండం పెట్టుకున్నారు జూ.ఇంజనీరుగారు.

"నీళ్లు అమ్ముతారా?"

"రూలు ప్రకారం అమ్మకూడదు. అమ్మితే ఈ

## బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

నీళ్ల కరువులో బకెట్ అయిదురూపాయలన్నా కొంటారు. కాని జనం దగ్గర మేము అర్ధరూపాయే తీసుకుంటాం. ప్రతి లారీకి కొన్ని నీళ్లు ఎలాగూ మిగులుతాయి. అవి ఏ హోటలు వాడికో ఎక్కువ రేటుకిచ్చేస్తాం".

"మీ ఏరియాకి నీళ్ల లారీలు కూడా రావడం లేదు"

"లెటర్ రాయండి, తప్పకుండా పంపిస్తాం" అన్నారు జూ.ఇంజనీరుగారు సంతోషంగా. నీళ్ల సప్లయి ఏరియాలు విస్తరిస్తున్న కొద్దీ లాభమే కదా.

భాస్కర్ చేసేదేమి లేక, ఇంజనీరు మిత్రుడు తనతో పదినిముషాలు ఏమీ పుచ్చుకోకుండా ఫ్రీగా మాట్లాడినందుకు సంతోషిస్తూ వెళ్లిపోయాడు.

"ఒరే మునిరత్నం లారీలు తిరిగొచ్చాయా" అని కేకేశారు జూ.ఇంజనీరు గారు.

"వచ్చాయి సార్, డ్రైవర్లు కేష్ పట్టుకొస్తున్నారు" అన్నాడు ప్యూన్ మునిరత్నం.

"ఇవాళ జనమేమీ గొడవ చెయ్యలేదు కదా"

"లేదుసార్, అర్ధరూపాయికే నీళ్లిస్తున్నందుకు అందరూ సంతోషించాలి కదా. ఈ రోజుల్లో నీళ్లింత చవగ్గా ఎక్కడ దొరుకుతాయి సార్"

కేష్ లెక్క పెట్టి అందరికీ రేషియోల ప్రకారం వాటాలు వెయ్యాలి. హెచ్చుతగ్గులొస్తే గొడవలొస్తాయి. ఇవాళకి పని అయిపోయినట్టే అందరి జేబులూ నిండి మొహాలు వికసించాయి.

అంతలో లేడీ టైపిస్టు క్లార్కు ట్రాన్సిస్టర్ పట్టుకొని గబగబా వచ్చింది.

"సార్, సార్, న్యూస్ విన్నారా?"

"ఏమిటమ్మలూ, ఎప్పుడూ ఏదో నేపాలూ, శ్రీలంకా అంటూ న్యూస్ పట్టుకొస్తావ్. ఎవడెలా పోతే మనకేమిటమ్మా"

"అదికాదు సార్. మనకి సంబంధించిన న్యూస్ వెదర్ బులిటిన్"

"వెదరుదేముందీ, ఎండలూ, నీళ్ల కరువూ అంతే కదా?"

"కాదు సార్, ఈ ఏడాది మాన్‌సూన్ ఎడ్వాన్స్ అయిందట. మరో పదిరోజుల్లో వానలు ప్రారంభం కావచ్చునట"

"వాట్? పదిరోజుల్లో వానలా? ఇంపాసిబుల్"

"కాదు సార్, వానలొస్తాయట. చెరువులూ నూతులూ నిండిపోతాయట."

"నిజంగానా? శ్రీహరీ ఏమిటీ అన్యాయం?" అన్నారు షాక్ తిన్న జూ.ఇంజనీరు గారు.

అంతలో ఒక్కసారి సడన్‌గా చీకటైపోయింది. ఒక పెద్ద మబ్బు సాయంకాలపు సూర్యుడ్ని కప్పేసింది. కిటికీలోంచి చల్లటి గాలి తెరలోపలి కొచ్చింది.

"సార్, మేఘాలు, మేఘాలు" అని కిటికీ లోంచి చూస్తూ అరిచింది లేడీ టైపిస్టు క్లర్కు.

జూనియర్ ఇంజనీరు గారికి కళ్లు తిరిగినట్టయింది. అసలే బ్లడ్ ప్రెషర్ మనిషికదా. సడన్‌గా గిడ్డీనెస్ వచ్చి పడిపోయారు. "అరెరె. ఏమైంది, ఏమైంది" అంటూ గుమాస్తాలు డ్రైవర్లూ చుట్టూ మూగేరు.

లేడీ టైపిస్టు క్లర్కు ముందుకు తోసుకుంటూ వచ్చి "జరగండి, జరగండి, ఆయనకి గాలి తగలనీండి. ఏం ఫరవాలేదు. కొద్దిగా శోష వచ్చినట్టుంది" అని గ్లాసుతో నీళ్లు తెచ్చి జూ.ఇంజనీరుగారి మొహంమీద జల్లింది. ఆయన కళ్లు తెరిచారు.

"తాగండి. దాహం తీరుతుంది" అంటూ ఆమె గ్లాసుతో నీళ్లు అందించింది.

జూ.ఇంజనీరు గారు నీళ్లు తాగి షాక్ నుంచి తేరుకొని లేచి నిలబడ్డారు. "మాన్‌సూన్ వస్తుందా, రానీ అమ్మా దేవుడు మనకెప్పుడూ ఏదో దారి చూపిస్తూనే ఉంటాడు. ఫరవాలేదు" అని మూలనున్న గొడుగు తీసుకొని, జేబులో అన్నీ భద్రంగా ఉన్నాయో లేదో తడిమి చూసుకుని, ఎదురుగా గోడమీద దేవుడి పటానికి దండం పెట్టుకుని ఇంటికి బయలుదేరేరు జూ.ఇంజనీరుగారు. ●

